


# నవతరం
తెలుగు దినపత్రిక






| హైదరాబాద్ | మంగళవారం | సంపుటి: 9 | సంచిక: 250 | పేజీలు: 04 | వెల: 5 /- | 06 అక్టోబర్ 2026 |


# వైద్య విద్యార్థిని మృతదేహం కలకలం

### కుళ్ళిపోయిన యువతి బాడీ.. ప్రియుడి కోసం గాలింపు



**హైదరాబాద్, నవతరం:** మహానగరంలో మరోసారి ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. పీజీ చదువుతూ వైద్యురాలిగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన ఓ యువతి, అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా తేలింది. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన కలకలం రేపింది.సంగారెడ్డి జిల్లాకు చెందిన కోమటి సృజన (27) హనుమకొండలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రి/కళాశాలలో పీజీ పీడియాట్రిక్స్ మొదటి సంవత్సరం అభ్యసిస్తోంది. భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్న ఆ యువతి, విధి నిర్వహణలో రాణించాల్సిన తరుణంలో ఇలా ప్రాణాలు కోల్పోవడం ఆమె కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. లీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సృజన సెప్టెంబర్ 30న హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పాటు ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందిన ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, సృజన మొబైల్ ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేశారు. ఆ లొకేషన్ మియాపూర్‌లోని ఓ హోటల్‌గా తేలింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆ హోటల్‌కు చేరుకున్నారు. సిబ్బంది సహాయంతో 502వ గదిని తెరిచి చూడగా.. అక్కడ సృజన విగతజీవిగా పడి ఉంది. అప్పటికే మృతదేహం డీకంపోజ్ (కుళ్ళిన) స్థితికి చేరుకోవడంతో చూసేందుకు భయానకంగా మారింది. పోలీసులు వెంటనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అనంతరం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులకు విచారణలో కీలక విషయాలు తెలిశాయి. గతంలో సృజన, రవికుమార్ అనే యువకుడు ప్రేమించుకున్నట్లు తేలింది. అయితే, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల గత ఆరు నెలలుగా సృజన అతనికి దూరంగా ఉంటోంది. సెప్టెంబర్ 30న సృజన హోటల్‌కు వచ్చిన సమయంలో రవికుమార్ కూడా ఆమెతో ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. సృజన మృతి చెందిన తర్వాత రవికుమార్ ఒక్కడే అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం ఉంది. మృతురాలి తండ్రి తన ఫిర్యాదులో రవికుమార్‌పై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలో సృజనకు సంబంధించిన బంగారు గొలుసును కూడా రవికుమార్ తీసుకున్నాడని ఆయన పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో రవికుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, అతడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజీలు, సృజన సెల్‌ఫోన్ కాల్ డేటా (CDR), ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ హత్యే లేక ఆత్మహత్యా అనే కోణంలో మియాపూర్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఇండియాలో 'ఐఏఎస్ సింగం'

### న్యూయార్క్ టైమ్స్‌లో 'రాక్‌స్టార్'

కఠిన చర్యలతో ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐఏఎస్ అధికారి తూకారాం ముండే పేరు ఇప్పుడు అంతర్జాతీయ మీడియా వేదికపై మార్మోగింది. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పరిశుభ్రత నిబంధనలు పాటించని రెస్టారెంట్లు, ఫుడ్ స్టోర్లపై కొరడా ఝుళిపిస్తున్న ముండేను 'ది న్యూయార్క్ టైమ్స్' ఏకంగా 'రాక్‌స్టార్'గా అభివర్ణించింది. ఆ పత్రిక ఫ్రంట్ పేజీలోనే ఆయనపై ప్రత్యేక కథనం ప్రచురించడం విశేషం. న్యూయార్క్ టైమ్స్ "ఇన్ ఇండియా, ఏ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈజ్ ఏ రాక్‌స్టార్" అనే శీర్షికతో ముండేపై కథనం ప్రచురించింది. "డైనర్స్ రెవర్ హిమ్ అండ్ ఓనర్స్ ఫియర్ హిమ్" అంటూ ఆయనకు వినియోగదారుల్లో ఉన్న అభిమానాన్ని, రెస్టారెంట్ యజమానుల్లో ఉన్న భయాన్ని ప్రస్తావించింది. వెబ్ కథనంలో ఆయన్ను 'ఫుడ్ సేఫ్టీ సెలబ్రిటీ'గా పేర్కొంది. ఆకస్మిక తనిఖీలతో ముండే ఇప్పటికే దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రెస్టారెంట్లు, ఫుడ్ షాపులు, గోదాములు, క్విక్ కామర్స్ డార్క్ స్టోర్లలో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు 'ఐఏఎస్ సింగం' అనే పేరు కూడా వచ్చింది. 'డొమినోస్', 'పిజ్జా హట్' ఔట్‌లెట్లలో తనిఖీల సందర్భంగా వంటగదుల్లో బొద్దింకలు, గడువు ముగిసిన ఉత్పత్తులు గుర్తించడంతో వాటిని తాత్కాలికంగా మూసివేశారు. ముంబయిలోని కొన్ని ప్రముఖ పాతకాలపు ఫుడ్ బిజినెస్‌ల లైసెన్సులపైనా తాత్కాలిక సస్పెన్షన్ వేటు పడింది. క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, జెప్టోకు చెందిన డార్క్ స్టోర్లలోనూ తనిఖీలు జరిగాయి. అక్కడ బల్లులు, బొద్దింకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు కథనాలు వెలువడ్డాయి. రెస్టారెంట్ యజమానులపై చర్యలు తీసుకుంటున్న ముండే.. పరిశుభ్రమైన ఆహారం కోరుకునే వినియోగదారుల్లో మాత్రం ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆ గుర్తింపే అంతర్జాతీయ స్థాయికి చేరింది. భారత్‌లో 'ఐఏఎస్ సింగం'గా పేరొందిన ఆయనను న్యూయార్క్ టైమ్స్ 'రాక్‌స్టార్'గా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది.




# అంబటి రాంబాబుకు నోటీసులు

### ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ

**హైదరాబాద్:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా.. అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**కేసు నేపథ్యం ఇదే..**

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.



# ప్రధాని మోదీ పేరిట పూజలు

### ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించిన పవన్ కళ్యాణ్

**విజయవాడ, నవతరం:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం.

ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.



# హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం

### 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు. అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ TGHB.telangana.gov.inను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు TGHBOS పేరుతో SMS, వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.



# హైదరాబాద్ నుండి విజయవాడకు

### మద్యం రవాణా స్కాంలో మాజీ మంత్రి కారుమూరికి సిట్ కస్టడీ

**హైదరాబాద్, నవతరం:** ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు. విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.

# ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్

- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష

**డా . నర్సింలు ఎల్లంపల్లి, సీనియర్ జర్నలిస్ట్**

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు. విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.



# మీ టైమ్ పాస్ కోసం నా పేరు వాడుకోవద్దు

**హైదరాబాద్, నవతరం:** ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరును అనవసర ప్రచారాలకు, చర్చలకు వాడుకోవద్దని, తన జీవితానికి అన్యాయం చేయొద్దని ఆయన చేతులెత్తి వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. తనకు ఎలాంటి పదవులపైనా, హోదాలపైనా ఆసక్తి లేదని బండ్ల గణేశ్ స్పష్టం చేశారు. "దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నాకు ఎలాంటి పదవుల మీద, హోదాల మీద, మరే విషయాల మీదా ఎలాంటి వ్యామోహం కానీ, ఆశ కానీ లేదు. లేనిపోని విషయాలు మాట్లాడి నా పేరును ఉపయోగించి నాకు ఇబ్బందులు కలిగించొద్దని మనస్ఫూర్తిగా రిక్వెస్ట్ చేస్తున్నాను" అని గణేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. బండ్ల గణేశ్ తాజా ట్వీట్ ఎవరిని ఉద్దేశించి చేసిందీ స్పష్టత లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# రోడ్డు ప్రమాదంలో తెలంగాణ మహిళ మృతి

**మిస్సోరి, నవతరం:** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన మహిళ మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన దారం సుప్రియ (31) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆమె కుటుంబంలో, మహబూబాబాద్ పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఉద్యోగరీత్యా అమెరికాలోని మిస్సోరిలో నివసిస్తున్న సుప్రియ, ఇవాళ తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) కారులో ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో వారు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు సుప్రియ అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెతో పాటు కారులో ఉన్న మరో భారతీయ యువతికి తీవ్ర గాయాలయ్యాయి. సుప్రియ భర్త కొడుమూరి రంజిత్, అత్తమామలు కొడుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ఏర్పాట్లపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ వార్త తెలియడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.




# సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

- **ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్**
- **ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు**
- **బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి**
- **కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం**
- **పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా**

**న్యూ ఢిల్లీ, నవతరం:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న ఉత్కంఠ నెలకొంది.



# క్రిస్టియన్ సేవా సమితి అసోసియేషన్‌కు అభినందనలు

**పటాన్‌చెరు, నవతరం:** నియోజకవర్గ క్రిస్టియన్ సేవా సమితి నూతన అసోసియేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ హాజరై, నూతన అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి, సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గూడెం మధు, మాజీ మార్కెట్ ఛైర్మన్ విజయ్, నరేష్, జీవన్, ఆర్తి, క్రిస్టియన్ సేవా సమితి సభ్యులు, MPR యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రా ప్రజావాణికి 61 ఫిర్యాదులు

**హైదరాబాద్, నవతరం:** చెరువులు కబ్జా కాకుండా కాపాడడమే కాకుండా.. వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్న తీరు ఎంతో ఆదర్శంగా ఉంది. హైడ్రా అభివృద్ధి చేయక ముందు తర్వాత చెరువులను పరిశీలిస్తే ఎంతో మార్పు కనపడుతోంది. చెరువుల చెంత దుర్గంధం పోయి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. కొన్ని చెరువులకే హైడ్రా పరిమితమైంది. మా ప్రాంతంలోని చెరువులను కూడా అభివృద్ధి చేయాలని సోమవారం హైడ్రా ప్రజావాణిలో పలువురు కోరారు. చెరువుల అభివృద్ధి అంటే సుందరీకరించేయడం కాకుండా.. చెరువులో 10 అడుగులకు పైగా పూడికను తొలగించి.. మొత్తం దుర్గంధాన్ని పారదోలిన తీరు బాగుంది. ఇలా నగరంలో అన్ని చెరువులను అభివృద్ధి చేయాలని జనవాణి పరిటె ప్రజల సమస్యలపై పోరాడే సంస్థ హైడ్రాను కోరింది. చెరువుల వివరాలతో ఈమేరకు వినతిపత్రం సమర్పించింది. అభివృద్ధి చేసిన చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా వర్షాకాలంలో వరద నీరు, మిగతా సమయంలో ఎస్‌టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపాలని విజ్ఞప్తి చేశారు. గండిపేట చెరువుతో పాటు.. హిమాయత్‌సాగర్ కూడా కలుషితమౌతోందని.. జంట జలాశయాలను కాపాడాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి ఇలా మొత్తం 61 ఫిర్యాదులు రాగా.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వాటిని పరిశీలించారు. వెనువెంటనే పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.







# అక్రమ షెడ్డుకు లైన్ క్లియర్..?

**కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్ గాజులరామారం సర్కిల్ - 57 లో అనుమతుల్లేని బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, కమర్షియల్ షెడ్ల నిర్మాణాలు కొనసాగిస్తున్నారు కొందరు కేటుగాళ్లు. టీజీ - బీ పాస్ చట్టానికి తూట్లు పొడుస్తూ.. లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు సదరు అక్రమ నిర్మాణదారులు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో జీరో అనుమతులతో ఎన్నో నిర్మాణాల పనులు కొనసాగుతున్నాయి. అయినా ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులకు అవేమీ పట్టవు. ఎన్ని వార్తా కథనాలు ప్రచురించినా.. స్థానికుల నుండి ఫిర్యాదులు అందినా.. అవన్నీ బుట్టదాఖలు చేస్తూ.. తమ విధులను మర్చిపోతుంటారు సదరు లంచగొండి అధికారులు. మొన్నటికి మొన్న.. మాదాపూర్ అంజయ్య నగర్లో జరిగిన 60 గజాల భవన నిర్మాణ ఘటన తర్వాత కొన్ని అక్రమ నిర్మాణాలను పాక్షిక కూల్చివేతలు చేశారు. ఎన్నో బహుళ అంతస్తుల నిర్మాణాలు, కమర్షియల్ షెడ్లు.. అయినా కొన్నింటి శ్లాబ్ లకు బొక్కలు పెట్టారు, కొన్ని షెడ్లను పాక్షిక కూల్చివేతలు చేసి ఫోటో షూట్ చేసుకుని ఫైల్ చేశారు స్థానిక మున్సిపల్ డిప్యూటీ కమిషనర్. అందులో భాగంగానే మహాదేవపురం కాలనీ U-90 (UPEL PVT. LTD) పక్క ప్లాట్ లో నిర్మించిన ఈ షెడ్డు కూల్చివేతల అనంతరం కొద్ది రోజులు అలాగే వదిలేశాడు సదరు నిర్మాణదారుడు. సుమారు ఒక పక్షం తర్వాత తిరిగి మళ్ళీ పనులు మొదలుపెట్టాడు. 'ఒకవైపు వార్తా కథనాలు, మరోవైపు ఫిర్యాదులు' అయినా మరమ్మత్తు పనులు మొదలు పెట్టాడంటే, స్థానిక టౌన్ ప్లానింగ్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టేనా..? అంటూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. అందుకు షెడ్డును కూల్చిన డిప్యూటీ కమిషనరే సమాధానం చెప్పాలి.



తేదీ: 05-10-2026 నాటి చిత్రం



తేదీ: 29-09-2026 నాటి చిత్రం

# బలమని భ్రమపడితే సరిపోదు

- బలగాన్ని కూడగడితేనే భవిష్యత్తు
- శ్రీకాకుళం వైసీపీకి ఇదే పరీక్షా?
- సామాజిక వర్గాల విభేదాలతో పార్టీలో సవాల్ తప్పదా?
- మైనార్టీల విస్మరణతో క్యాడర్ లో అసంతృప్తి నిజమేనా?
- ఏడు నియోజకవర్గాల్లో అంతర్గత విభేదాలు ఉన్నాయా?

వ్యాసకర్త: శిరిగిరి వరదరాజు, చీఫ్ ఎడిటర్ - నవతరం తెలుగు దినపత్రిక

**శ్రీకాకుళం, నవతరం:** ఉభయరాయం చూసి బలవంతుడు అనుకోవద్దనే పాత సామెత నేటి శ్రీకాకుళం జిల్లా వైసీపీ పరిస్థితికి అక్షరాలా సరిపోతుందని జిల్లా రాజకీయ వర్గాల్లో బలమైన చర్చ జరుగుతోంది. పైకి చూడడానికి పార్టీ చాలా బలంగా, పటిష్టంగా కనిపిస్తున్నా, లోపల అంతర్గతంగా కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రూపులు, రెండు ప్రధాన సామాజిక వర్గాల మధ్య అంతర్గత విభేదాలు, బల ప్రదర్శనలు, మైనార్టీలను పరిగణలోకి తీసుకోకపోవడం, కీలక నేతలు తమ గ్రూపులను బలం చేకూర్చే విధంగా విభజించు పాలించు అనే సూక్తికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ఇవన్నీ కలిసి పార్టీని లోలోపల ఇబ్బందులకు గురిచేస్తున్నాయని క్షేత్రస్థాయి క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విశ్లేషకులు విస్తృతంగా చర్చించుకున్నారు. అసలు జిల్లాలో ఏం జరుగుతోంది అంటే, గత వారంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు జిల్లాలోని వారికి ఒక బలమైన సామాజిక వర్గం సన్మాన సభకు అదే సామాజిక వర్గ ప్రజా ప్రతినిధులను జిల్లాలోని కీలక నేతలు అడ్డుకున్నారని ఆరోపణలు క్షేత్రస్థాయిలో చక్కర్లు కొడుతున్నాయి. అది నిజమో కాదో దేవుడికే తెలియాలి అని కార్యకర్తలు చెబుతున్నా, ఈ ఒక్క సంఘటన చాలు పార్టీలో ఎంత లోతైన విభేదాలు ఉన్నాయో అర్థం చేసుకోవడానికి. ఒక సామాజిక వర్గం సభకు అదే సామాజిక వర్గ నేతలను రాకుండా అడ్డుకోవడం అంటే అది సామాన్యమైన విషయం కాదు, అది ఆధిపత్య పోరుకు పరాకాష్ట అని విశ్లేషకులు అంటున్నారు. నువ్వా నేనా అన్నట్లుగా బల ప్రదర్శనలు, సభల నిర్వహణ, ఒకరినొకరు దెబ్బకొట్టుకునే ప్రయత్నాలు పార్టీకి పెద్ద సవాల్ గా మారాయి. నేను ఉంటే నువ్వు ఉండకూడదు, నువ్వు ఎదిగితే నా పదవికి ముప్పు అనే భయం, అభద్రతా భావం నేతల్లో స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు.




జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోనూ పూర్తిస్థాయిలో పార్టీ అంతర్గతంగా బలం చేకూర్చే విధంగా ప్రయత్నించాలంటే నేటి పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవని చెప్పక తప్పదు. ఇచ్ఛాపురం నుంచి పాతపట్నం వరకు ప్రతి నియోజకవర్గంలోనూ ఇద్దరు ముగ్గురు నాయకుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట ఈ ఏడు నియోజకవర్గాల్లోనూ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది, కానీ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఆ బలం ఓట్లుగా మారడం లేదు. ఒక నేత కార్యక్రమం పెడితే మరో నేత వెళ్లడం లేదు, ఒక నేత సభ పెడితే మరో నేత అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక నలిగిపోతున్నారు. పార్టీ కార్యాలయానికి వెళ్లాలంటే కూడా ఏ గ్రూపు వారిది అని చూసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని సీనియర్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉండి కొంతవరకు ప్రజాదరణ కలిగి ప్రజలతో మమేకమైనటువంటి కొంతమంది సీనియర్ నాయకులకు, జనాభా ప్రాతిపదికన అధిక జనాభా కలిగిన సామాజిక వర్గాలలోని వారికి చాలా కాలంగా దూరం పెట్టడం జరుగుతోంది. వారిని కావాలనే పక్కన పెట్టారు, వారికి కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు, పార్టీ కార్యక్రమాలకు పిలవడం లేదు. దీంతో వారు తీవ్ర ఆవేదనకు లోనై చివరకు వారి ప్రయాణం ఎటువైపు సాగుతుందోనని పార్టీ శ్రేణులు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు. సీనియర్లను గౌరవించకపోతే పార్టీకే నష్టం తప్ప లాభం లేదని, వారికి ఉన్న అనుభవం, ప్రజల్లో ఉన్న పట్టు పార్టీకి ఎంతో అవసరమని, కానీ కీలక నేతలు తమ స్వార్థం కోసం వారిని దూరం చేస్తున్నారని అంటున్నారు. జిల్లాలోని కీలక నేతలు ఏకపక్ష నిర్ణయాలతో తన మాటకు, నిర్ణయాలకు తిరుగు ఉండకూడదనే ధోరణితో ఉన్నారని ప్రచారం బలంగానే ఉంది. నేను చెప్పిందే వేదం, నేను తీసుకున్న నిర్ణయమే ఫైనల్, ఎవరూ ప్రశ్నించకూడదు అనే ధోరణి పార్టీలో పెరిగిపోయింది. దీనివల్ల కింది స్థాయి నాయకులకు, కార్యకర్తలకు మాట్లాడే స్వేచ్ఛ లేకుండా పోయింది. ఏదైనా చెబితే తమ పదవులు పోతాయో, తమను పక్కన పెడతారో అనే భయంతో చాలా మంది మౌనంగా ఉంటున్నారు. ఇది పార్టీకి మంచిది కాదు, ప్రజాస్వామ్య పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలి, అందరి మాట వినాలి అని సీనియర్లు అంటున్నారు.

మరో అత్యంత కీలకమైన అంశం మైనార్టీలను పూర్తిగా విస్మరించడం. శ్రీకాకుళం జిల్లాలో మైనార్టీ ఓట్లు చాలా కీలకం. పలాస, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, ఆమదాలవలస వంటి నియోజకవర్గాల్లో మైనార్టీ ఓట్లు ఫలితాలను ప్రభావితం చేసే శక్తి కలిగి ఉన్నాయి. కానీ గత కొంతకాలంగా మైనార్టీ నాయకులను, కార్యకర్తలను పార్టీ పూర్తిగా విస్మరిస్తోంది. వారిని కీలక సమావేశాలకు పిలవడం లేదు, వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. దీంతో మైనార్టీ వర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మమ్మల్ని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్ప మా అభివృద్ధిని, మా ప్రాతినిధ్యాన్ని పట్టించుకోవడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. **ఇక పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి తీరుపై కూడా క్షేత్రస్థాయిలో చర్చ జరుగుతోంది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఏనాడూ నాయకులు చెప్పిన మాటల ప్రకారమే నిర్ణయాలు కానీ, ఎన్ని వార్తలు వచ్చినా, ఎంతమంది శ్రేయోభిలాషులు పలువిధాలుగా తెలియజేసినా ఏనాడూ కూడా పార్టీ క్షేత్రస్థాయిలోని వాస్తవాలను తెలుసుకొని అందుకు అనుకూలంగా నమ్మకమైన సమర్థుడైన వ్యక్తితో దర్యాప్తు జరిపించి నిజాలను తెలుసుకొని నేడున్న పరిణామాల పట్ల భవిష్యత్తు నిర్ణయాలను ఏ విధంగా తీసుకోవాలి, ఎక్కడ లోపం జరుగుతుంది, దానిని ఏ విధంగా సరిచేయాలనే ఆలోచన అధినేతకు లేనే లేదని చెప్పక తప్పదని సీనియర్ నాయకులు అంటున్నారు. సహజంగా సినిమా నటులకు అభిమానులు ఉంటారు, రాజకీయాల్లో కూడా చరిష్మా కలిగి అత్యధిక శాతం ప్రజలు అభిమానించే ప్రజా నాయకుడు శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు అయితే వారందరూ కూడా పార్టీకి విధేయులు, ఓట్లు వేసేవారు అని భ్రమపడడం సరైన విధానం కాదు. అభిమానం వేరు, ఓటు వేరు. అభిమానులు సినిమా చూస్తారు, కానీ ఓటు వేసేటప్పుడు స్థానిక నాయకుడిని, స్థానిక పరిస్థితులను, తమకు జరిగిన న్యాయాన్ని చూస్తారు. ఈ వాస్తవాన్ని అధినేత గుర్తించాలి. ఏదేమైనా ప్రజాభిమానం జగన్మోహన్ రెడ్డి గారి పైన, వైసీపీ పార్టీ పైన బలంగానే ఉంది. జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు, ఆయన పాలన ప్రజల మదిలో ఇప్పటికీ ఉన్నాయి. కానీ అంతర్గత లోపాలను దీర్ఘకాలంగా సరిచేయలేకపోవడం వల్లనే ఆ అభిమానం ఓట్లుగా మారడం లేదు. పార్టీకి పునాది అయిన కార్యకర్తలను, సీనియర్ నాయకులను, అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లకపోతే ఎంత చరిష్మా ఉన్నా ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధిష్టానం, అధినేత గుర్తించి తక్షణమే నిబద్ధత కలిగిన సొంత వ్యక్తితో అంతర్గతంగా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా భవిష్యత్తు నిర్ణయాలను నిర్మోహమాటంగా, నిబద్ధతగా తీసుకున్న నాడు శ్రీకాకుళం జిల్లాలో పార్టీ విజయావకాశాలు బలంగానే ఉన్నవి అనుటకు ఎటువంటి సందేహం లేదు. ఆశిద్దాం ఇప్పటికైనా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా అన్ని వర్గాలకు సముచితమైన న్యాయం చేసేందుకు వర్గ విభేదాలకు తావులేని విధంగా పార్టీ నిర్ణయాలు తీసుకొని పార్టీ శ్రేణులను నాయకులను ఒక తాటిపైకి తీసుకొని వచ్చేందుకు సమైక్యంగా సమరంలో పాల్గొనే విధంగా నిర్ణయాలు ఉంటాయని...**

# బీపీ, షుగర్, కిడ్నీకి విడివిడిగా వైద్యం వద్దు: డాక్టర్ ఊలాల కోదండరాం

**బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులను ఇప్పటివరకు వేర్వేరుగా చూశాం. కానీ వాటన్నింటిని కలిపి ఒకే సిండ్రోమ్ గా గుర్తించి సమగ్ర చికిత్స అందించాలని దేశవ్యాప్తంగా 50 మంది అగ్రశ్రేణి వైద్య నిపుణులు ఏకాభిప్రాయంతో రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026' స్పష్టం చేస్తోంది. ఈ విధాన పత్రం ప్రతిష్టాత్మక 'ది లాన్సెట్ రీజనల్ హెల్త్ - సౌత్ ఈస్ట్ ఆసియా' జర్నల్ లో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో CKM సిండ్రోమ్ అంటే ఏమిటి, సామాన్యులకు దాని ముప్పు ఎంత, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై మహాలక్ష్మి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఊలాల కోదండరాం తో నవతరం దినపత్రిక ప్రతినిధి జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ.**

**ప్రశ్న: CKM సిండ్రోమ్ అంటే ఏమిటి? దీనిని ఇప్పుడు ఎందుకు ప్రత్యేకంగా చెబుతున్నారు?**

**జవాబు:** ఇది చాలా ముఖ్యమైన అంశం. గతంలో మధుమేహం వస్తే ఎండోక్రైనాలజిస్ట్ దగ్గరకు, బీపీ వస్తే జనరల్ ఫిజిషియన్ దగ్గరకు, కిడ్నీ సమస్య వస్తే నెఫ్రాలజిస్ట్ దగ్గరకు, గుండె నొప్పి వస్తే కార్డియాలజిస్ట్ దగ్గరకు వెళ్లేవాళ్లం. కానీ ఇవన్నీ విడివిడి కాదు, ఒకే గొలుసులోని లింకులు అని ఇప్పుడు తేలింది. షుగర్ పెరిగితే కిడ్నీ ఫిల్టర్ దెబ్బతింటుంది, కిడ్నీ దెబ్బతింటే బీపీ పెరుగుతుంది, బీపీ పెరిగితే గుండె రక్తనాళాలు మూసుకుపోతాయి. అందుకే దీనిని కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్ సిండ్రోమ్ అన్నారు. మూడు సమస్యలు కలిసి ఉన్న వ్యక్తికి 10 ఏళ్లలో గుండె జబ్బుతో చనిపోయే ముప్పు 30 నుండి 50 శాతం వరకు ఉంటుందని వారణాసి డిక్లరేషన్ హెచ్చరిస్తోంది. అందుకే వేర్వేరుగా కాకుండా ఒకే గొడుగు కింద చికిత్స అవసరం.

**ప్రశ్న: భారతీయులకు ఈ ముప్పు ఎందుకు ఎక్కువగా ఉంది?**

**జవాబు:** మన దేశంలో ప్రస్తుతం 10.1 కోట్ల మంది మధుమేహంతో, 13.6 కోట్ల మంది ప్రీ-డయాబెటిస్ తో, 20 కోట్లకు పైగా రక్తపోటుతో, 17 శాతం మంది కిడ్నీ బాధపడుతున్నారు. దేశంలో ఏటా 25 లక్షల మంది పనిచేసే వయసులోనే, అంటే 40 నుండి 60 ఏళ్ల మధ్య ఈ మూడు కారణాల వల్లే చనిపోతున్నారు. దీనికి కారణం మన శరీరతత్వం. మనల్ని 'థిన్-ఫ్యాట్ ఇండియన్ ఫినోటైప్' అంటారు. అంటే బయటకు సన్నగా, బరువు తక్కువగా కనిపిస్తాం కానీ పొట్ట చుట్టూ, కాలేయం చుట్టూ కొవ్వు ఎక్కువగా ఉంటుంది. విదేశీయులకు BMI 25 దాటితేనే ప్రమాదం అనుకుంటే, మనకు BMI 23 దాటితేనే ప్రమాదం మొదలవుతుంది. నడుము కొలత పురుషులకు 90 సెంటీమీటర్లు, మహిళలకు 80 సెంటీమీటర్లు దాటితేనే డేంజర్. కానీ ఇప్పటివరకు మనం విదేశీ ప్రమాణాలనే వాడుతున్నాం. అందుకే వారణాసి డిక్లరేషన్ భారతీయులకు ప్రత్యేక కొలతలు, ప్రత్యేక స్క్రీనింగ్ పద్ధతులు ఉండాలని సూచించింది.

**ప్రశ్న: ప్రస్తుత చికిత్స విధానంలో లోపం ఏమిటి?**

**జవాబు:** అతి పెద్ద లోపం సమగ్రత లేకపోవడం. ఒకే పేషెంట్ కు షుగర్, బీపీ, కిడ్నీ మూడు ఉన్నా మూడు వేర్వేరు చోట్లకు వెళ్తున్నాడు. ప్రాణాలు కాపాడే మూడు మందులు ఉన్నాయి. ఒకటి రెనిన్-యాంజియోటెన్సిన్ బ్లాకర్స్, రెండు SGLT2 ఇన్హిబిటర్లు, మూడు స్టాటిన్లు. ఈ మూడూ కలిపి వాడితే గుండె, కిడ్నీ రెండూ రక్షించబడతాయి. కానీ మన దేశంలో ఈ మూడూ కలిపి వాడుతున్నది 20 శాతం కంటే తక్కువ మంది మాత్రమే. దీనికి కారణం అవగాహన లేకపోవడం, ఖర్చు ఎక్కువ అనే భయం. అందుకే ఈ మూడు మందులను నిత్యావసర ఔషధాల జాబితాలో చేర్చి ధరలు తగ్గించి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచాలని డిక్లరేషన్ ప్రభుత్వాన్ని కోరింది.

**ప్రశ్న: సామాన్య ప్రజలు ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి?**

**జవాబు:** కిడ్నీ వ్యాధిని సైలెంట్ కిల్లర్ అంటారు. 70 శాతం కిడ్నీ పాడయ్యే వరకు బయటకు లక్షణాలు కనిపించవు. అందుకే బీపీ, షుగర్ ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి రెండు పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఒకటి eGFR టెస్ట్, రెండు యూరిన్ అల్బుమిన్ క్రియాటినిన్ రేషియో. ఏడాదికి ఒకసారి కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, సీరం క్రియాటినిన్ చేయించుకోవాలి. కాళ్లు, కళ్ల చుట్టూ వాపు రావడం, రాత్రిపూట ఎక్కువసార్లు మూత్రం రావడం, మూత్రంలో నురగ రావడం, రక్తం రావడం, విపరీతమైన అలసట, ఆకలి లేకపోవడం ఇవన్నీ ప్రమాద సంకేతాలు. వీటిని నిర్లక్ష్యం చేసి వయసు పైబడటం వల్ల వచ్చాయని అనుకోవద్దు. వెంటనే నెఫ్రాలజిస్ట్ ను కలవాలి.

**ప్రశ్న: జీవనశైలిలో ఎలాంటి మార్పులు చేసుకోవాలి?**

**జవాబు:** నాలుగు సూత్రాలు చెబుతాను. మొదటిది ఉప్పు తగ్గించండి. రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ, అంటే ఒక చిన్న టీ స్పూన్ కంటే తక్కువ ఉప్పు తినాలి. ఊరగాయలు, అప్పడాలు, ప్యాకెట్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తగ్గించాలి. రెండవది రోజూ 30 నిమిషాలు వేగంగా నడవండి, వ్యాయామం చేయండి. మూడవది నొప్పి నివారణ మందులు NSAIDs ను డాక్టర్ సలహా లేకుండా వాడవద్దు. అవి కిడ్నీకి రక్త ప్రసరణను తగ్గించి తీవ్ర గాయం చేస్తాయి. నాలుగవది సోషల్ మీడియాలో వచ్చే హెర్బల్ పౌడర్లు, బాడీ బిల్డింగ్ సప్లిమెంట్లు వాడవద్దు. వాటిలో భార లోహాలు ఉండి కిడ్నీని పాడు చేస్తాయి. అలాగే రోజూ 7 నుండి 8 గంటలు నిద్ర పోవాలి, ధూమపానం మానేయాలి, మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి.

**ప్రశ్న: ఇచ్ఛాపురం లాంటి మారుమూల ప్రాంతాల ప్రజలకు మీ సూచన?**

**జవాబు:** ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, కంచిలి ప్రాంతాల్లో ప్రజలు రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో పనుల ఒత్తిడిలో ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. బీపీ, షుగర్ మందులు క్రమం తప్పకుండా వేసుకోవడం లేదు. స్థానిక పీహెచ్సీల్లోనే బీపీ, షుగర్ తో పాటు కిడ్నీ పరీక్షలు కూడా చేయించుకోవాలి. ఆశా వర్కర్లు, ANM ల ద్వారా CKM స్క్రీనింగ్ చేయాలని వారణాసి డిక్లరేషన్ సూచించింది. బీపీ, షుగర్, కిడ్నీకి వేర్వేరుగా కాకుండా ఒకే చోట, ఒకే వైద్యుడి పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే ఖర్చు తగ్గుతుంది, ప్రాణం నిలుస్తుంది. ముందుగానే గుర్తిస్తే డయాలసిస్ వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.



- మూడింటికి కలిపి ఒకే చికిత్సే శ్రేయస్కరం
- మూడు జబ్బులు ఉన్నవారికి పదేళ్లలో గుండె జబ్బుతో మరణ ముప్పు 30 నుండి 50 శాతం
- దేశంలో ఏటా 25 లక్షల మంది పనిచేసే వయసులోనే అకాల మరణం
- విదేశీ ప్రమాణాలు భారతీయుల శరీరతత్వానికి సరిపోవు
- వారణాసి డిక్లరేషన్ 2026 భారతీయులకు ప్రత్యేక మార్గదర్శకాలు
- సన్నగా కనిపించినా లోపల కొవ్వు ఎక్కువ - థిన్ ఫ్యాట్ ముప్పు
- ప్రాణాలు కాపాడే మూడు కీలక మందులు వాడుతోంది 20 శాతం మంది మాత్రమే
- ఆరు నెలలకోసారి కిడ్నీ పరీక్షలు తప్పనిసరి
- స్పెషల్ ఇంటర్వ్యూలో నవతరంతో.. డాక్టర్ ఊలాల కోదండరాం

# తెలంగాణలో డైనోసార్లు తిరిగాయా?



- వేమనపల్లి ప్రాంతంలో డైనోసార్ అవశేషాల గుర్తింపు
- 1984లో అవశేషాలు బయటపడినట్లు సమాచారం
- ప్రాణహిత పరివాహకంలో శిలాజాల ఆనవాళ్లు
- రాజారంలో కాకతీయుల కాలం నాటి విగ్రహాలు
- 12వ శతాబ్దానికి చెందిన దశావతార విగ్రహాలు

**స్పెషల్ స్టోరీ, నవతరం:** తెలంగాణ అంటే చారిత్రక కోటలు, దేవాలయాలు, పచ్చని అడవులు గుర్తొస్తాయి. కానీ.. ఈ నేలపై కోట్ల ఏళ్ల క్రితం డైనోసార్లు సంచరించాయంటే నమ్మగలరా? మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి ప్రాంతం అలాంటి ఆసక్తికర విషయాలను తనలో దాచుకుంది. ప్రాణహిత నది పరీవాహక ప్రాంతంలో డైనోసార్ అవశేషాలు, వివిధ జీవుల శిలాజాలు బయటపడినట్లు స్థానిక కథనాలు చెబుతున్నాయి. అదే ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లు కూడా ఉండటం విశేషం.

**డైనోసార్ అవశేషాలు**

మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ప్రాణహిత నది ప్రవహించే ప్రాంతమే వేమనపల్లి. 1984లో మంగెనపల్లి అటవీ ప్రాంతంలో భూగర్భ, పురావస్తు శాఖ అధికారులు డైనోసార్ అవశేషాలను గుర్తించారు. సుమారు 14 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల ఎత్తు ఉన్న జీవికి చెందిన అవశేషాలు బయటపడటంతో అప్పట్లో సంచలనం రేగింది. సుంపుటం, ఒడ్డుగూడెం, మంగెనపల్లి ప్రాంతాల్లోనూ అవశేషాలు లభించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**రాళ్లలో దాగిన జీవం**

వేమనపల్లి పరిసరాల్లో శిలాజీకరణ చెందిన చెట్ల ఆనవాళ్లు కూడా కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. వాగులు, నది మలుపుల వెంట వివిధ ఆకారాల్లో రాళ్లు కనిపిస్తుంటాయి. వాటిలో కొన్ని చేపలు, సముద్ర నక్షత్రాలు, తాబేళ్ల ఆకారాలను పోలి ఉంటాయని చెబుతున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో చెట్లు ఇసుక పొరల్లో కూరుకుపోయి.. చాలా కాలానికి శిలాజాలుగా మారి ఉండొచ్చని భావిస్తున్నారు.

**కాకతీయుల ఆనవాళ్లు కూడా..**

వేమనపల్లి ప్రత్యేకత డైనోసార్లతోనే ఆగిపోలేదు. రాజారం గ్రామంలోని దశావతార విగ్రహాలు సుమారు 12వ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. ఇవి కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లుగా గుర్తింపు పొందాయి. అంటే.. ఒకవైపు కోట్ల ఏళ్ల క్రితం జీవించిన జీవుల ఆనవాళ్లు.. మరోవైపు శతాబ్దాల క్రితం మనుషులు నిర్మించిన చారిత్రక గుర్తులు ఇక్కడ కనిపిస్తాయి.

**ప్రకృతి, చరిత్ర కలిసిన ప్రాంతం**

ప్రాణహిత నది, దట్టమైన అడవులు, అరుదైన వృక్షజాతులు, శిలాజాలు, డైనోసార్ అవశేషాలు, కాకతీయుల కాలం నాటి విగ్రహాలు.. ఇలా వేమనపల్లిలో ప్రకృతి, చరిత్ర, భూగర్భ రహస్యాలు ఒకే చోట కనిపిస్తాయి. ఈ ప్రాంతంలోని పురాతన ఆనవాళ్లపై మరింత శాస్త్రీయ పరిశోధన జరిగితే తెలంగాణ గతానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అనిషా వలలో నాలుగు లక్షల తిమింగలం

**తెలంగాణ ఏసీబీ చరిత్రలో అతి పెద్ద అవినీతి కేసు వెలుగులోకి వచ్చింది. మెహదీపట్నం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించి ఆమెను అరెస్టు చేశారు.ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు.**

**హైదరాబాద్, నవతరం:** మెహదీపట్నం GHMC కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయింది. నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో వల పన్ని పట్టుకున్నారు. ఓ నిర్మాణ భవనానికి సంబంధించిన అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. అందులో భాగంగా మొదటి విడతగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా ACB అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. లంచం మొత్తాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సునీతను అదుపులోకి తీసుకున్న అనంతరం మెహదీపట్నం GHMC కార్యాలయంలో ACB అధికారులు సోదాలు నిర్వహించారు. సంబంధిత ఫైళ్లు, పత్రాలు, రికార్డులను పరిశీలించిన అధికారులు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. లంచం డిమాండ్‌కు సంబంధించి మరిన్ని ఆధారాలను సేకరించే పనిలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, తదుపరి న్యాయపరమైన చర్యలపై ACB అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిక పని కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ACBని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. లంచం ఆరోపణలకు సంబంధించి తుది నిర్ధారణ దర్యాప్తు, న్యాయ ప్రక్రియ అనంతరం వెలువడుతుంది.



# మా ఊరికి మందు వద్దు..

**మంచిర్యాల, నవతరం:** సాధారణంగా మద్యం సేవించే వారిలో మధ్య వయస్కులు, యువతే ఎక్కువగా కనిపిస్తుంటారు. పార్టీలు, వేడుకలు అంటే మందు ఉండాల్సిందే అనే రోజులివి. కానీ మంచిర్యాల జిల్లాలోని ఓ గ్రామంలోని యువత మాత్రం ఇందుకు భిన్నంగా ఆలోచించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ గ్రామంలో మద్యానికి తావులేదని, బెల్ట్ షాపులు అసలే వద్దంటూ ఫ్లకార్డులు పట్టుకుని రోడ్డెక్కి నిరసన గళం విప్పారు. తమ గ్రామానికి బెల్ట్ షాపులు తీసుకురావద్దని.. యువత రోడ్డెక్కి ధర్నాకి దిగిన ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్ షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా స్థానిక యువత తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగారు. గ్రామస్తులందరినీ ఏకం చేసి ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుకు నిరసనగా ఉద్యమానికి సిద్ధమయ్యారు.

**మామూళ్ల మత్తులో అధికారులు**

గ్రామంలో ఎక్కడపడితే అక్కడ బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామస్తులు మద్యానికి బానిసలవుతున్నారని యువత ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఎన్నో కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారి ఇళ్లు, ఒళ్లు గుల్లవుతున్నాయని వాపోయారు. అంతేకాకుండా మద్యం మహమ్మారి కారణంగా తమ తోటి యువత భవిష్యత్తు కూడా నాశనమవుతోందని ఆందోళన చెందారు. బెల్ట్ షాపులను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులే మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపిస్తూ ఎక్సైజ్ సీఐ తీరుపై ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

**తీర్మానం చేసినా పట్టించుకోని అధికారులు**

ఇది ఇప్పటి సమస్య కాదని, గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా గతంలోనే గ్రామపంచాయతీలో తీర్మానం కూడా ఆమోదించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలోని బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని, మద్యపానాన్ని నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామ యువత హెచ్చరించింది.




# అభినందనలు తెలిపిన పోలీస్ ఇన్స్పెక్టర్ ఎన్. సురేష్

**సైబరాబాద్, నవతరం:** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్ తేజశ్రీ ఈ సంవత్సరం (2026) జరిగిన తెలంగాణ స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ బ్యాడ్మింటన్ విభాగంలో.. సింగిల్స్ లో గోల్డ్ మెడల్, డబుల్స్ లో గోల్డ్ మెడల్, మిక్స్డ్ డబుల్స్ లో బ్రాండ్స్ మెడల్స్ సాధించారు. తన యొక్క అత్యుత్తమ ప్రదర్శనను ప్రదర్శించి మెడల్స్ సాధించినందుకు జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ ఎన్. సురేష్ తేజశ్రీ ని శాలువాతో సన్మానించారు. అనంతరం, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కట్టవీర నాగ అంజిబాబు కుమార్తె అయిన హేమ హాసిని బీడీఎస్, ఎస్వీఎస్ ప్రభుత్వ మెడికల్ కళాశాల మహబూబ్ నగర్ నందు సీట్ పొందిన సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎన్. సురేష్ వారిని శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.







# అమ్మోరు తల్లికే ఐపీ నోటీసు

**తాడిపత్రి, నవతరం:** తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండల కేంద్రంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. అప్పులు తీర్చలేనంటూ మాయకుంట్ల మోహన్ ఏకంగా చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీకి ఐపీ నోటీసు పంపారు. ఆలయ కమిటీకి చెల్లించాల్సిన రూ.3 లక్షల బకాయితో పాటు మొత్తం 56 మంది నుంచి తీసుకున్న సుమారు రూ.1.65 కోట్ల అప్పులు తీర్చలేనని పేర్కొంటూ రుణదాతలందరికీ నోటీసులు పంపారు. అప్పులు ఎక్కువైతే వ్యక్తులు ఐపీ నోటీసులు పంపడం మనం చూస్తుంటాం.. కానీ, ఏకంగా దేవుడికే, అది ఓ అమ్మవారి ఆలయానికే ఐపీ నోటీస్ వస్తే ఎలా ఉంటుంది? వినడానికే కాస్త విడ్డూరంగా ఉన్నా.. ఈ వింత ఘటన అనంతపురం జిల్లాలో వెలుగు చూసి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అనంతపురం జిల్లా యాడికి మండలంలో చోటుచేసుకున్న ఓ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. మండల కేంద్రానికి చెందిన మోహన్ అనే వ్యక్తి.. శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికే ఏకంగా ఐపీ నోటీస్ పంపించాడు. ఈ విషయం తెలిసిన స్థానికులు, భక్తులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

**56 మంది నుంచి రూ.1.65 కోట్ల అప్పులు**

మోహన్ మొత్తం 56 మంది వద్ద నుంచి సుమారు రూ.1.65 కోట్ల వరకు అప్పులు చేసినట్లు సమాచారం. చేసిన అప్పులను తీర్చే పరిస్థితి లేదని పేర్కొంటూ రుణదాతలందరికీ ఐపీ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. అదే క్రమంలో ఆలయ కమిటీకి చెల్లించాల్సిన రూ.3 లక్షల బకాయికి సంబంధించి కూడా నోటీసు పంపడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా వ్యక్తిగత రుణదాతలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఇలాంటి నోటీసులు పంపుతుంటారు. అయితే దేవత పేరుతో ఉన్న ఆలయ కమిటీకి కూడా ఐపీ నోటీసు పంపడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం యాడికిలో చర్చనీయాంశంగా మారింది. మోహన్ తీసుకున్న అప్పులు, ఐపీ నోటీసుల వెనుక ఉన్న పూర్తి వివరాలపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. అసలు ఆలయానికే ఐపీ నోటీస్ పంపాల్సిన అవసరం మోహన్‌కు ఎందుకు వచ్చింది? ఆ మూడు లక్షల రూపాయల బకాయిల వెనుక ఉన్న అసలు కథేంటి? ఆలయ కమిటీ సభ్యులు దీనిపై ఎలా స్పందిస్తారు? అనేది ప్రస్తుతం యాడికి మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

సాధారణంగా ఆర్థిక లావాదేవీల్లో చిక్కులు వచ్చి, అప్పులు తీర్చలేకపోయినప్పుడు వ్యక్తులకు లేదా సంస్థలకు ఐపీ నోటీసులు వస్తుంటాయి. కానీ, మోహన్ అనే వ్యక్తి తనకు అప్పులు ఇచ్చిన వారి జాబితాలో చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయాన్ని కూడా చేర్చి నోటీస్ పంపడం చర్చనీయాంశంగా మారింది. మోహన్, ఆలయ కమిటీకి సుమారు 3 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఈ అప్పుల వ్యవహారంలో భాగంగానే, తనకు అప్పులిచ్చిన మిగిలిన వారితో పాటు అమ్మవారి ఆలయానికి కూడా మోహన్ నోటీసులు పంపించాడు.







ADVERTISEMENT




Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.

https://epaper.navatharam.com